క్లుప్తంగా

గ్రంథాలయంలో యోగా తరగతులు



చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో యోగా చేస్తున్న చిన్నారులు

నక్కపల్లి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం యోగా తరగతులు నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జనార్దన్ మాట్లాడుతూ శారీరక సమతుల్యతను కలిగించే ఏకైక సాధనం యోగా మాత్రమేనన్నారు. గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులకు ఆట పాటలతో పాటు, చదువు, వినోదం, విజ్ఞానం, వివిధ రకాల పోటీలు, యోగా కూడా నేర్పిస్తున్నామన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఇక్కడ నేర్చుకున్న ఆసనాలను ఇంటి వద్ద కూడా కొనసాగిస్తే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగా వల్ల బుద్ధి కుశలత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి



హనుమాన్ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాకలోని సంతబయిలులో ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ చైర్మన్ కాండ్రేగుల మణికంఠ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన సోమవారం ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అభిషేకాలు, తమలపాకులతో పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడారి గోవింద్, బి.ప్రసాద్, పెంటకోట శివగణేష్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దోహదపడుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతుల భూములకు సంబంధించిన వివాదాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ శేషుబాబు, ఆర్ఐ పడాల్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడ్రాపల్లి హైస్కూల్ టీచర్ ప్రసాద్ హఠాన్మరణం



కాతుల జాన్ ప్రసాద్, స్కూల్ అసిస్టెంట్, వాడ్రాపల్లి హైస్కూల్

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్) కాతుల జాన్ ప్రసాద్(61) గుండె పోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. అనకాపల్లికి చెందిన ప్రసాద్ గత కొంత కాలంగా వాడ్రాపల్లి హైస్కూల్‌లో పని చేస్తూ పిల్లలకు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పొందేందుకు ఎనలేని కృషి చేశారు. మరో ఏడాదిలోగా ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన గుండెపోటుకు గురై మృతి చెందడంపై పలువురు విచారం వ్యక్తం చేశారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడులతో పాటు ఎంఆర్సీ కార్యాలయం ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. ప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు.

తలుపులమ్మతల్లి పండగ నేడు



తంగేడు కాటా వద్ద తలుపులమ్మతల్లి గుడి వద్ద డెకరేషన్ చేస్తున్న యువకులు

కోటవురట్ల: తంగేడు గ్రామంలో తలుపులమ్మతల్లి పండగను మంగళవారం నిర్వహించనున్నారు. ఇందు కోసం తంగేడు కాటా వద్ద అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామం అంతా విద్యుద్దీపాలంకరణ చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నట్టు సర్పంచ్ కొర్సప్రోలు శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి గ్రామంలో పల్నాటి రుద్రయ్య అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నామని తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారి ఆలయం వద్ద దర్శనాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ప్రమాదమని తెలిసినా.. గత్యంతరం లేక రాకపోకలు..!

- సాగునీటి కాలువలపై తాటి చెక్క వంతెనలే దిక్కు
- పలు చోట్ల ఉన్న బ్రిడ్జిలకు కానరాని రక్షణ గోడలు
- రైతుల సమస్యలు పట్టని అధికారులు



రక్షణ గోడకు నోచుకోని మునగపాక-అరబుపాలెం రోడ్డులోని ఫుట్‌పాత్ బ్రిడ్జి



మునగపాకలో పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న తాటిచెక్క వంతెన

మునగపాక: ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం. తమ పొలాలకు చేరుకునేందుకు రైతులు సరైన మార్గాలు లేక అవస్థలు పడుతున్నారు. నిత్యం భయం గుప్పిట్లోనే పొలాలకు చేరుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఫుట్‌పాత్ బ్రిడ్జిలు నిర్మిస్తామంటూ నాయకులు హామీలు గుప్పించడం పరిపాటిగా మారింది. తీరా అధికారంలోకి వచ్చాక రైతుల గోడు వినే నాథుడే కరువయ్యారంటూ కలవరపడుతున్న పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

సాగునీటి కాలువలపై ప్రమాదకరంగా బ్రిడ్జిలు

మండలంలోని పలు సాగునీటి కాలువలపై గతంలో బ్రిడ్జిలు నిర్మించారు. ఈ బ్రిడ్జిలు కనీసం 3 అడుగుల పొడవుకు నోచుకోలేదు. దీనికి తోడు ఎటువంటి రక్షణ గోడలు నిర్మించకపోవడంతో పొలాలకు వెళ్లే రైతులు భయాందోళన చెందుతున్నారు. రాకపోకలు సాగించే సమయంలో ఏమాత్రం ఏమరపాటు ప్రదర్శించినా ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుంది. బ్రిడ్జిలపై నడిచి వెళ్లేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి. అయితే ఇవి ఎక్కడా కానరావడం లేదు.

తాటి చెక్కలే వంతెనలు

మరికొన్ని చోట్ల పొలాలకు వెళ్లేందుకు తాటి చెక్కలే దిక్కవుతున్నాయి. ఈ తాటి చెక్కలను సాగునీటి కాలువలపై రైతులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నారు. కాలువలను దాటాలంటే తప్పనిసరిగా తాటి చెక్క వంతెనపై రాకపోకలు సాగించాల్సిందే. వీటిపై రాత్రి సమయంలో అత్యవసర పరిస్థితుల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మహిళా రైతుల వేదనలు చెప్పనక్కరలేదు. తాటిచెక్కల స్థానంలో ఫుట్‌పాత్ బ్రిడ్జిలు నిర్మించాలని పదేపదే రైతులు కోరుతున్నా అధికారుల నుంచి ఎటువంటి స్పందన రావడం లేదు. సాగునీటి కాలువల ద్వారా నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో తాటి చెక్కలపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలపై తట్టలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ నిత్యం రాకపోకలు సాగించడం తప్ప చేసేది లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి కాలువలపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు లేకుండా ఫుట్‌బ్రిడ్జిలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

తాటిచెక్కలపై నుంచే రాకపోకలు



ఏళ్ల తరబడి తాటిచెక్కలపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాం. పొలాలకు వెళ్లేందుకు ఈ వంతెనలే దిక్కుగా కనిపిస్తున్నాయి. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేదు. మహిళా రైతుల పరిస్థితి మరీ దయనీయం.

– నూరిశెట్టి గోవింద, రైతు, మునగపాక

రైతుల కష్టాలు తీర్చడంలో విఫలం



వ్యవసాయ రంగం అంటేనే కూటమి ప్రభుత్వానికి అయిష్టత. రైతుల కష్టాలు తీర్చడంలో కూటమి నేతలు విఫలమవుతున్నారు. సాగునీటి కాలువలపై నిర్మించిన ఫుట్‌పాత్ బ్రిడ్జిలకు రక్షణ కొరవడింది. పలు చోట్ల రైతులే తమ పొలాలకు వెళ్లేందుకు తాటి చెక్కల వంతెనలు ఏర్పాటు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయి.

– ఎస్.బ్రహ్మాజీ, సీపీఎం నేత

ప్రభుత్వం దృష్టికి సమస్యలు..

సాగునీటి కాలువలపై బ్రిడ్జిలకు రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఫుట్‌పాత్ బ్రిడ్జిల నిర్మాణాలు, రక్షణ గోడలు వంటి సమస్యలను గుర్తించాం. ప్రభుత్వానికి సమస్యలను నివేదించాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తాం.

– సుప్రియ, నీటి పారుదల శాఖ ఏఈ, మునగపాక మండలం

మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దీపిక

మునగపాక: మునగపాక పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికకు సభ్యులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల రాక కోసం ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో సంబంధిత ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి వి.దీపిక విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని నివేదిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడుతూ వచ్చిన ఉప సర్పంచ్ ఎన్నిక నేడు కూడా మరోసారి వాయిదా పడడం విశేషం. ఎన్నిక నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ప్రసాదరావు బందోబస్తు నిర్వహించారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



యండపల్లిలో ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టరు విశ్వనాథ్

కోటవురట్ల: ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టరు విశ్వనాథ్ సూచించారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలోని యండపల్లి, సుంకపూరు, తంగేడు, కోటవురట్ల, రాట్నాలపాలెం, లింగాపురం గ్రామాలలో సోమవారం పర్యటించి ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాల అనుమానితులను కలుసుకున్నారు. రక్షిత మంచినీటి పథకాలు, చేతిబోర్లు నుంచి తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఆయా గ్రామాల సచివాలయాలలో సమావేశాలు నిర్వహించి ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు, అనుసరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గతంలో ఫ్లోరోసిస్ బారిన పడిన వారికి పరికరాలు చేతికర్రలు, చక్రాల కుర్చీలు, నడుము, మెడ పట్టీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవోలు ఎస్.గోవిందరావు, టి.బుల్లిబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు, రోడ్డు కోసం కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన యలమంచిలి మున్సిపాలిటీ అత్తిలి వారి చేలు కాలనీ ప్రజలు

యలమంచిలి రూరల్: 'కాలనీలో 40 ఏళ్లుగా నివాసముంటున్నాం.. సరైన రహదారి లేదు, నిత్యం లోవోల్టేజి సమస్యతో పాటు కిలోమీటరు దూరం వెళి తేగానీ తాగునీరు దొరకని పరిస్థితి.. ప్రతి ఏటా 100 శాతం ఆస్తి, నీటి పన్నులు మున్సిపాలిటీకి చెల్లిస్తున్నాం. అయినా మా కాలనీ సమస్యలు మాత్రం అలాగే ఉండిపోయాయి. మాకు తక్షణమే తాగునీటిని సరఫరా చేయించండి'అంటూ యలమంచిలి మున్సిపాలిటీ పరిధి 18వ వార్డు అత్తిలివారి చేలు కాలనీ వాసులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మేము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని వారంతా వాపోయారు. యలమంచిలి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి దాదాపు 12 సంవత్సరాలు దాటినా తమ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, అంతర్గత రహదారులు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు నోచుకోకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామంటూ వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో తమ కాలనీకి రూ.40 లక్షలతో సీసీ రోడ్డు వేసినట్టు శిలాఫలకం వేశారని, కానీ రోడ్డు మాత్రం మరోచోట వేశారని వారు ఫిర్యాదులో ఆరోపించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ముబారక్ మండి దాబా ఎదురుగా సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన కొందరు వ్యక్తులు ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యలమంచిలి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు గోడ రవి, గొల్లవిల్లి శివకుమార్, కొఠారు అజయ్ గాయపడ్డారు. రవి రెండు కాళ్లు, శివకుమార్ కుడికాలు విరిగిపోయాయి. అజయ్ కుడి మోకాలు కింద రక్తగాయమైంది. వీరిని మొదట యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స తర్వాత అనకాపల్లిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గోడ రవి బావమరిది పోలిమేర సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాండవ కాలువ పనుల పరిశీలన



తాండవ కాలువ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం : తాండవ ఆయకట్టు పరిధిలో కల్వర్టులు ఆక్విడెక్టులు మరమ్మతు పనులు చురుగ్గా చేస్తున్నామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. ఆమె సోమవారం తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసే కాలువల మరమ్మతులు పనులు పరిశీలించారు. ఈఏడాది తాండవ కాలువలు అభివృద్ధి కోసం 18 పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంతవరకూ 5 పనులు పూర్తి చేశామని, మరో రెండు పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఉపాధి నిధులతో తాండవ కాలువలో పూడికతీత పనులు చేస్తున్నారన్నారు. తాండవ ప్రధాన గేట్ల లీకేజీ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు.

పునరావాసం కల్పించాలి



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బార్క్ నిర్వాసితులు

అచ్యుతాపురం రూరల్: బార్క్ నిర్వాసిత గ్రామం రావిపాలేనికి పునరావాసం కల్పించాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఆర్ఆర్ కార్డులు, ఇంటి నిర్మాణాలకు రూ.25 లక్షలు, డీ-పట్టా భూములకు రూ.60 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. బార్క్ రోడ్డుతోపాటు పాఠశాలలు, ఆస్పత్రులు తాము వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కో-జెడ్పీటీసీ నర్మాల కుమార్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చెప్పుట, రాయించుట, తెలుగు వ్యాకరణం చెప్పారు. అనంతరం ఎస్.సీతారామమూర్తి విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, హిందీ వాక్యాలు చదివించడం, రాయించడం చేశారు. మ్యాథ్స్ చెప్పారు. అనంతరం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు.

'ఫీజుతో పని లేదు.. పరీక్ష రాయవచ్చు'

నర్సీపట్నం : పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థులంతా సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.తలుపులు తెలిపారు. పరీక్ష ఫీజు కట్టలేని విద్యార్థుల హాల్ టిక్కెట్లను కూడా ఆన్‌లైన్‌లో జనరేట్ చేశారన్నారు. పరీక్ష ఫీజు కట్టినా కట్టకపోయిన హాల్ టిక్కెట్ తీసుకుని పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఆయా పాఠశాలలకు వెళ్లి హాల్ టిక్కెట్లు తీసుకుని పరీక్షకు సిద్ధం కావాలని విద్యార్థులకు ఎంఈవో సూచించారు.

సుజల స్రవంతి భూ సర్వే అడ్డగింత

రావికమతం : తోటకూరపాలెం రెవెన్యూ పరిధిలో సుజల స్రవంతి భూములు సర్వే చేయనీకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా పెదపూడి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. పెదపూడి, పంగిడి, తోటకూరపాలెంలోని భూములు సుజల స్రవంతి ప్రాజెక్టులో కలుస్తాయి. తహసీల్దార్ ఆదేశాల మేరకు తోటకూరపాలెం పరిధిలో ప్రభుత్వానికి చెందిన చెరువులు, కొండ గెడ్డలు, వాగులు, కొండ పోరంబోకు, డి.పట్టా భూములు సర్వే చేయడానికి తోటకూరపాలెం, చీమలపాడు, టి.అర్జాపురం వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లు తోటకూరపాలెం వెళ్లారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కోల్పోయే భూములకు ధర నిర్ణయించకుండా సర్వే చేయడానికి వీల్లేదని రైతులు అభ్యంతరం తెలిపారు. తహసీల్దార్ రైతులతో ఫోన్‌లో మాట్లాడగా గ్రామసభ నిర్వహించి భూములకు ధర ఎంత నిర్ణయిస్తారో తేల్చాక అందరి ఆమోదంతోనే సర్వే చేయాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో సోమవారం జిల్లేడుపూడి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 78 మంది రోగులను పరీక్షించి మరి కొంత మందికి రక్త పరీక్షలు చేశారు.

సచివాలయంలో రైతుల పడిగాపులు



సర్వసిద్ధి సచివాలయంలో నిరీక్షిస్తున్న రైతులు



మునగపాకలో అన్నదాత సుఖీభవ పథకం వివరాలు నమోదు చేసుకుంటున్న రైతులు

ఎస్.రాయవరం: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల్లో పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకునే రైతులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమలు చేసే అన్నదాత సుఖీభవ పొందాలంటే ఆన్‌లైన్ ఉన్న పేర్లు సరిచూసుకోవాల్సిందే. ఏమాత్రం పొరపాటున పేరు లేకున్నా సుఖీభవ నిధులు జమ కావని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటి వరకు సచివాలయాలకు కొన్ని పేర్లు ఉన్న జాబితా మాత్రమే వచ్చింది. మిగతా వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. భర్త చనిపోయి భార్య నేరుగా అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు చేసుకోవడానికి గతం మాదిరిగా లేదని, భార్యపై ఖాతా నెంబర్ ఉంటేనే అర్హత ఉంటుందని చెబుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకం నమోదుకు గడువు మంగళవారంతో ముగియనుండడం, మరో వైపు సర్వర్ మొరాయించడంతో సచివాలయాల్లో రైతులు పడుగాపులు కాస్తున్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి నేడు తుది గడువు

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి మంగళవారంతో గడువు ముగియనుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. మునగపాక సచివాలయంలో జరుగుతున్న పథకం రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకానికి కావాల్సిన అన్ని పత్రాలను అందజేయాలన్నారు. వీఏఏ సింధూజను ఇంత వరకు ఎంత మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు పాటుపడాలి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మునగపాక: ప్రతి ఒక్కరూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా సుందరయ్య జీవితం సాగిందన్నారు. 15వ ఏటనే సుందరయ్య అంటరానితనం నేరమంటూ దళిత ఉద్యమానికి నాంది పలికారన్నారు. సుందరయ్య పోరాట పటిమను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, ఆడారి రామలక్ష్మి, మళ్ల సత్యనారాయణ, ప్రసాద్, దొడ్డి తేజ, ఆళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మ్యాజిక్ బస్ ప్రతినిధులు జ్యోతి,శ్యామల

మునగపాక: ప్రజా సమస్యలను గుర్తించి వాటిని ప్రజలతోనే పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మ్యాజిక్ బస్ సంస్థ ఏఈ జ్యోతి, ఎల్ఎస్ఈ శ్యామల తెలిపారు. సోమవారం మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో మునగపాక సచివాలయం దరి దొగలగారిపేట వాసులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు పరోక్షంగా తాము సహాయపడగలమన్నారు. ప్రజా సమస్యలపై గైడెన్స్ ఇస్తూ వాటిని ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కలిస్తామన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, మహిళా పోలీసు పి.వరలక్ష్మి, ఏఎన్ఎం దేవకి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



గణపర్తిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

మునగపాక: వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్య తలెత్తకుండా అవసరమయ్యే చర్యలు తీసుకున్నామని ఆ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని గణపర్తిలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రతి రోజూ 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఈఈ రామకృష్ణ, ఏడీఈ సురేష్, ఏఈ జగదీష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కోసం రైతుల నిరీక్షణ



సమావేశానికి హాజరైన రైతులు

అచ్యుతాపురం రూరల్ : బార్క్ రోడ్డు నుంచి మేకరాశి కొండ వరకూ నిర్మించే 60 అడుగుల రోడ్డు నిమిత్తం భూసేకరణ కోసం నిర్వహించిన సమావేశానికి తహసీల్దార్ హాజరు కాకపోవడంతో రైతులు నిరాశతో వెనుతిరిగారు. సోమవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు తమ్మయ్యపేట పాఠశాల దగ్గర సాయంత్రం 4 గంటలకు రైతులు హాజరు కావాలని సమాచారం ఇచ్చారు. దొప్పెర్ల వీఆర్వో వెంకట్, ఇరువాడ సచివాలయం సర్వేయర్ సాయి మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ కోసం నిరీక్షించిన రైతులు ఆయన రాకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, కొల్లి వరహాలరావు, కొల్లి సన్నిబాబు, ముచ్చు గంగరాజు, రైతులు పాల్గొన్నారు. 0

కోళ్ల వ్యర్థాల అక్రమ రవాణాపై ఫిర్యాదు

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో కోడి మాంసం వ్యర్థాల నిల్వ, అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యలమంచిలి మండలం జంపపాలెం గ్రామానికి చెందిన చాకలి నూకరాజు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోడి మాంసం విక్రయాలు చేస్తున్న దుకాణదారులతో కొందరు అక్రమార్కులు ఒప్పందం కుదుర్చుకుని ప్రత్యేకమైన డబ్బాల్లో నిల్వ చేసి రెండు, మూడు రోజులకొకసారి చికెన్ వ్యర్థాలను వారికి అందజేస్తున్నారని, వారు ప్రత్యేక వాహనాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పక్క జిల్లాల్లోని చేపల చెరువులకు తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిల్వ చేసిన చికెన్ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారన్నారు. ఇలా పెరిగిన చేపలను ఆహారంగా తీసుకుంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఫిర్యాదుదారుడు సాక్షికి తెలిపారు.